పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

# తుఫాను నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి



**ఏలూరు, అక్టోబర్, 25 : ప్రభాతవార్త**
తుఫాన్ కారణంగా జిల్లాలో రానున్న 3 రోజులపాటు భారీ నుండి అతి భారీ వర్షాలు, తీవ్రమైన గాలులు వీస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరిక దృష్ట్యా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. తుఫాన్ పరిస్థితిపై ఆదివారం సాయంత్రం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ తుఫాన్, భారీ వర్షాల కారణంగా జిల్లాలో నదులు, చెరువులు, కాలువలకు గండ్లు పడకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖాధికారులకు కలెక్టర్ ఆదేశించారు;. తుఫాన్ తీరం దాటే సమయంలో నదీ పరివాహక ప్రాంతాలలోని ప్రజలు నదిలోకి వెళ్లకుండా అధికారులు తుఫాన్ తీవ్రతపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఏలూరు కలెక్టరేట్ లో 18002331077, 08812-224519 , 9491041419 ఫోన్ నంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలు ఈ నంబర్లకు ఫోన్ చేసి తుఫాన్ తీవ్రతను తెలుసుకోవచ్చని, ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కోనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు. చెట్లు కూలిపోయిన కారణంగా విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న కల్వర్టులు, కాజ్ వే ల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో శిధిల భవనాలు, చెట్లు కారణంగా ఎటువంటి ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ బి. వినూత్న, ఆర్డీఓ లు లక్ష్మి ప్రసన్న, రమణ, ట్రాన్స్కో ఎస్ఈ అంబేద్కర్ , పంచాయతీరాజ్ ఎస్ఈ జెడ్. రమేష్, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ప్రభృతులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 3 వరకు
# పిజిఆర్ఎస్ రద్దు : కలెక్టర్ నాగరాణి



**పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 25, ప్రభాతవార్త**
జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న కారణంగా అధికారు లందరూ ఎన్నికల విధుల్లో నిమజ్జనమై ఉన్నందున స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు డిసెంబర్, 3వ తేదీ వరకు జిల్లాలో పిజిఆర్ఎస్ కార్యక్రమంతాత్కాలికముగా రద్దు చేయ డం జరిగిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణీ నేడు ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలు ఈ విషయాన్ని గమనించవల సిందిగా కలెక్టర్ కోరారు. అర్జీదారులు తమ ఫిర్యాదులను అధికారిక వెబ్సైట్ మీకోసం .ఏపీ .గవర్నమెంట్ .ఇన్ ద్వారా కూడా నమోదు చేసుకోవ చ్చని, ప్రజలు తమ ఫిర్యాదు నమోదు, ఫిర్యాదుల స్థితి తదితర సమాచారం ను 1100 టోల్ఫ్రీ నంబర్కు కాల్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలియ జేసారు..

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
# జాతీయ స్థాయిలోనూ సత్తా చాటాలి

- క్రీడల్లో ప్రతిభకు కృషి, పట్టుదలే పునాది.
- రోప్ మాల్కంబ్, పోల్ మాల్కంబ్ పోటీల విజేతలకు పతకాలు ప్రదానం.
- జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.



**వీరవాసరం, అక్టోబర్ 25 ప్రభాతవార్త**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు క్రీడల్లో తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో అత్యుత్తమ విజయాలు సాధించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. ఆదివారం వీరవాసరంలోని మద్దాల రామకృష్ణమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలియజేసి, పతకాలను ప్రదానం చేశారు. 70వ ఆంధ్రప్రదేశ్ పాఠశాల క్రీడోత్సవాలు 2026--2027లో భాగంగా ఉమ్మడి జిల్లాల అండర్--14, అండర్--17, అండర్--19 బాలబాలికల రోప్ మాల్కంబ్, పోల్ మాల్కంబ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా కలెక్టర్ అభినందించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు తగిన అవకాశాలు, ప్రోత్సాహం కల్పిస్తే వారు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని పేర్కొన్నారు.

**తాడు, స్తంభాలపై అద్భుత విన్యాసాలు.. విద్యార్థుల ప్రతిభకు కలెక్టర్ ప్రశంసలు**

తాడు, స్తంభాలపై వివిధ యోగాసనాలు, క్లిష్టమైన విన్యాసాలను ప్రదర్శించడం సాధారణమైన విషయం కాదని అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన అద్భుతమైన నైపుణ్యం, శారీరక సామర్థ్యం, ఏకాగ్రత, పట్టుదల తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. ప్రతి విన్యాసం వెనుక నిరంతర సాధన, క్రమశిక్షణ, శిక్షకుల మార్గదర్శకత్వం ఉంటాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా అసాధారణ ప్రతిభను ప్రదర్శించగలరని ఈ క్రీడా పోటీలు నిరూపిస్తున్నాయని చెప్పారు. విద్యార్థులకు సరైన శిక్షణ, అవసరమైన వసతులు, తగిన ప్రోత్సాహం అందించినప్పుడు వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించగలరని స్పష్టం చేశారు. క్రీడల్లో సాధించే విజయాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని అందిస్తాయని వివరించారు.

**క్రీడలతో శారీరక దృఢత్వం.. మానసిక చురుకుదనం.**

క్రీడలు విద్యార్థులకు కేవలం శారీరక వ్యాయామాన్నే కాకుండా, ఏకాగ్రత, సమయస్ఫూర్తి, క్రమశిక్షణ, మానసిక చురుకుదనం, చేతులు--కళ్ల మధ్య సమన్వయం వంటి కీలక నైపుణ్యాలను పెంపొందిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులు తమ వ్యక్తిత్వాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరచడంతో పాటు విద్యా రంగంలోనూ ఉన్నత ఫలితాలు సాధించాలని, ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాలు పొందుతూ జీవితంలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రస్తుత పోటీల్లో సాధించిన విజయాలతో సంతృప్తి చెందకుండా, మరింత కష్టపడి సాధన చేసి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తమ విజయాలతో తోటి విద్యార్థులకు, యువతకు, సమాజంలోని ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని కోరారు.



**విజేతలకు అభినందనలు.. శిక్షకులకు కలెక్టర్ ధన్యవాదాలు.**

క్రీడాకారులకు శిక్షణ అందించి, వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేసిన శిక్షకులను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులను ప్రోత్సహిస్తూ క్రీడా పోటీల్లో పాల్గొనేలా సహకరిస్తున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సభ్యులకు, ఉపాధ్యాయులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల విజయాల్లో శిక్షకులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం అందిస్తున్న సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు.

**రోప్ మాల్కంబ్, పోల్ మాల్కంబ్ పోటీల్లో జిల్లాల జట్లకు పతకాలు.**

70వ ఆంధ్రప్రదేశ్ పాఠశాల క్రీడోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రోప్ మాల్కంబ్ అండర్--14 మహిళల విభాగం వ్యక్తిగత పోటీల్లో ముగ్గురు క్రీడాకారులు పతకాలు సాధించారు. జట్ల విభాగంలో పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, కృష్ణా జిల్లాల జట్లు పతకాలు గెలుచుకున్నాయి. అదేవిధంగా పోల్ మాల్కంబ్ అండర్--14 బాలుర విభాగంలో విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల జట్లు పతకాలు సాధించి ప్రతిభను చాటాయి. విజేతలకు జిల్లా కలెక్టర్ పతకాలు అందజేసి అభినందించారు. క్రీడాకారులందరూ ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. --ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అనిల్ కుమార్, మండల విద్యాశాఖ అధికారి శ్రీమన్నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీనవరపు ప్రసాద్, పాఠశాల కార్యదర్శి మహమ్మద్ ఖుద్దూస్, శారీరక విద్య ఉపాధ్యాయుడు మల్లేశ్వరరావు, ఇతర అధికారులు, శిక్షకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చి'వరి' దశలో
# ఆర్నబ్ గజగజ

- డెల్టాలో రైతుల గుండెల్లో తుఫాను రైళ్లు
- 50 శాతం చేలు కోతకు సిద్ధం
- కోస్తాకు ముప్పు తప్పదని హెచ్చరిక
- బియ్యం కొనాలంటేనే భయం



**నరసాపురం-- ప్రభాతవార్త**
డెల్టా ప్రాంతంలో వరి చివరి దశలో ఉంది. ఎగువ ప్రాంతంలో 10 శాతం కోతలు కూడా మొదలయ్యాయి. అధికారులు ధాన్యం కొనే పనిలో నిమగ్నమయ్యారు. ఇందుకోసం అవసరమైన యంత్రాంగాన్ని కూడా సిద్ధం చేశారు. సాధారణంగా డెల్టాలో సార్వా పంటకు వర్షం మునక తుఫాను భయాలు ఉంటాయి. ఈసారి ఎల్లినినొ ప్రభావం వల్ల ఆ ముప్పు ఉండదని రైతులు ఆశించారు. 42 45 బస్తాలు దిగుబడి వస్తుందని ధాన్యానికి రేటు ఉన్నందున లాభాలు కూడా ఉంటాయని ఆశించారు. వరదలు ఒకటి రెండు తుఫాన్లు దాటుకొని సార్వవరి చివరి దశకు చేరుకుంది. అయితే అరన్నబ్ తుఫాను కోస్తాకు చెరువులోనే ఉండడంతో పశ్చిమ డెల్టా పై తుఫాను ప్రభావం ఉంటుందని హెచ్చరిక గట్టిగా వినపడుతోంది. యంత్రాంగం కూడా ఈ మేరకు హెచ్చరికను విడుదల చేసింది

మచిలీపట్నం కాకినాడలకు సమీపంలో ఉండడంతో రాబోయే రెండు రోజుల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు ఉంటాయని చెబుతున్నారు. అందుకు తగ్గట్టుగానే వర్షాలు కూడా ఉన్నాయి. ఉభయగోదావరి జిల్లాలో సాధారణంగా దీపావళికి తుఫాను అలజడి ఉంటుంది. తుఫాను తప్పితే భారీ వర్షాలు ఉంటాయి. గత రికార్డులు కూడా వీటిని స్పష్టం చేస్తున్నాయి. దీపావళి మరో పక్షం రోజుల్లో రానుంది. తుఫాను హెచ్చరిక కూడా విడుదల కావడంతో వరిపై అమావాస్య ప్రభావం ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు 5 లక్షల ఎకరాల్లో 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం గట్టుకు రావాల్సి ఉంది. ధాన్యం దిగుబడి బాగానే ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు. సెప్టెంబర్ నెలలో కురిసిన భారీ వర్షాల వల్ల గోస్తనీ తమ్మిలేరు ప్రభావంతో తణుకు తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో వరి మునకకు గురై ఆ ప్రాంత రైతులు నష్టపోవడం జరిగింది. రానున్న తుఫానుతో డెల్టా మొత్తానికి ముప్పు వాటిల్లింది. ఈ గండం దాటి నవంబర్ నెల వరకు వాతావరణం కలిసి వస్తే 50 నుండి 60 శాతం దాన్యం మిల్లుకు చేరుతుంది. ఈ పంట నష్టపోతే బియ్యం ధర మరింత పెరిగే అవకాశం కూడా లేకపోలేదు. ఇప్పటికే సన్న బియ్యం కిలో 90 నుండి 100 రూపాయలు మతకు రకాలు 50 నుండి 70 రూపాయలు అమ్ముతున్నారు. బియ్యం కొనాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ప్రకృతి విపత్తులతో పండిన నాలుగు గింజలు మట్టిపాలైతే పరిస్థితి మరింత విశ్రమిస్తుంది.



## మంత్రి నిమ్మల కృషితో
# ఇంటి స్థలాల పట్టాలు
## చాకిరేవుగుంట వాసుల ఇంటి కల సాకారం



**పోడూరు, అక్టోబర్ 25,ప్రభాత వార్త** : మండలం జిన్నూరు గ్రామం చాకిరేవుగుంట ప్రాంతవాసుల రెండు దశాబ్దాల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చొరవతో ఇంటి స్థలాల పట్టాలు లభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి హక్కు పత్రాలు లేక ఇబ్బందులు ఎదుర్కొన్న తమకు ఇప్పుడు భరోసా లభించిందని తెలిపారు. తమ చిరకాల సమస్యను పరిష్కరించిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపేందుకు ఆదివారం పాలకొల్లులోని ఆయన కార్యాలయానికి చేరుకున్నారు.రెండు దశాబ్దాల కల నెరవేరడంతో తమ కుటుంబాలకు సొంత ఆస్తి సమకూరిందని ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పాలకొల్లునియోజకవర్గంతోపాటు ప్రతి గ్రామం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ప్రజలకు మేలు చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో దాసరి రత్న రాజు, పాలవలస తులసీరావు, కుక్కల సత్యనారాయణ, భూపతి రాజు సత్యనారాయణ రాజు, పెన్మత్స కాశీ విశ్వనాథరాజు, గిరిగి గోపాలకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# తణుకులో ఘనంగా ఎమ్మెల్యే రాధాకృష్ణ జన్మదిన వేడుకలు
## సేవా కార్యక్రమాలు నిర్వహించిన కూటమి శ్రేణులు



**తణుకు, అక్టోబర్ 25(ప్రభాత వార్త):** తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ జన్మదిన వేడుకలు ఆదివారం నియోజకవర్గవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయన అభిమానులు, తెలుగుదేశం పార్టీతో పాటు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు వివిధ ప్రాంతాల్లో జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో అభిమానులు, కూటమి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షిస్తూ పూజలు చేసినట్లు తెలిపారు. పలు ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. జన్మదిన వేడుకల్లో భాగంగా పలువురు అభిమానులు, నాయకులు వృద్ధాశ్రమాలను సందర్శించి వృద్ధులకు భోజన ఏర్పాట్లు చేశారు. వృద్ధులతో కొంత సమయం గడిపి వారికి భోజనం అందజేశారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా సామాజిక బాధ్యతను చాటుకున్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రోగుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని, వారికి ఆహార పదార్థాలను అందజేశారు. పుట్టినరోజు వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గవ్యాప్తంగా అభిమానులు, కూటమి నాయకులు, కార్యకర్తలు చేపట్టిన ఈ కార్యక్రమాలు సందడి వాతావరణంలో కొనసాగాయి. వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన పూజలు, అన్నదాన కార్యక్రమాలు, రోగులకు ఆహార పంపిణీ కార్యక్రమాలతో జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పుష్కరాల అభివృద్ధికి కూటమి గెలుపు ముఖ్యం

**కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కొవ్వలి రామ్మోహన్ నాయుడు జోరుగా ప్రచారం**

**రానున్న గోదావరి పుష్కరాల నాటికి నరసాపురాన్ని సమగ్రంగా తీర్చిదిద్దే బాధ్యత కూటమిదేనని స్పష్టం**



**నరసాపురం అక్టోబర్ 25 ప్రభాతవార్త**
నరసాపురం పురపాలక సంఘం పరిధిలోని 4వ, 5వ వార్డులలో ఆదివారం ఉదయం ఎన్డీయే కూటమి అభ్యర్థుల ఎన్నికల ప్రచారం హోరెత్తింది. కూటమి బలపరిచిన మున్సిపల్ చైర్పర్సన్ అభ్యర్థిని కొత్తపల్లి శైలజ జానకీరామ్, 4వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిని భూపతి దుర్గాదేవి, 5వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిని తిరుమాని శశిదేవిల విజయానికై తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ శ్రీ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు గారు విస్తృతంగా పర్యటించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వార్డు ప్రజలతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, నరసాపురం మరింత వేగంగా ప్రగతి సాధించాలంటే స్థానిక పాలకవర్గంలో కూటమి అభ్యర్థుల విజయం ఎంతో కీలకమని పేర్కొన్నారు. వచ్చే ఏడాది ప్రతిష్ఠాత్మకంగా జరగనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని నరసాపురం పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికలు రచిస్తోందని, పుష్కర ఘాట్లు, రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతులన్నీ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలంటే స్థానిక సంస్థల్లో కూటమి నాయకత్వానికే అధికారం కట్టబెట్టాలని పిలుపునిచ్చారు. ప్రజాసేవకు నిరంతరం తపించే మున్సిపల్ చైర్పర్సన్ అభ్యర్థిని కొత్తపల్లి శైలజ జానకీరామ్కు గాజు గ్లాస్ గుర్తుపై, 4వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిని భూపతి దుర్గాదేవికి సైకిల్ గుర్తుపై, 5వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిని తిరుమాని శశిదేవికి సైకిల్ గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. వార్డుల పరిధిలోని ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు, అభ్యర్థులు, కార్యకర్తలు, కొవ్వలి ఫాలోవర్స్, మహిళలు మరియు స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం అభ్యర్థులను గెలిపించండి. జె ఎన్ వి గోపాలన్.



**పెనుమంట్ర, అక్టోబర్ 25, (ప్రభాతవార్త)** ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జె ఎన్ వి గోపాలన్ అన్నారు. పెనుమంట్ర జడ్పిటిసి స్థానానికి కే తా గోపాలం, పెనుమంట్ర ఎంపీటీసీ2 స్థానానికి కోడి లక్ష్మి పోటీ చేస్తున్నారని వారి ఇరువురికి ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఆదివారం పెనుమంట్రలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తూ ఆయన మాట్లాడారు. ఇంటింటికి తిరిగి ఓటర్లను కలిసి ఓట్లను అభ్యర్థించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు మూడేళ్లు అయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా అబద్ధాలు చెబుతూ ప్రజలను మోసగిస్తుందని అన్నారు. 50 ఏళ్లకే పేన్షన్, నిరుద్యోగ భృతి కల్పిస్తామని అనేక హామీలు ఇచ్చిందని అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా తమ గెలుపు కోసం అడ్డదారులు తొక్కుతూ ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు కూడా వేయనివ్వకుండా అడ్డుకుంటుందని అన్నారు. పెనుమంట్ర మండలంలో ఇళ్ల స్థలాలు, ఉపాధి హామీ పనులు, దళితుల స్మశానాలు, కౌలు రైతులు, రైతుల సమస్యలపై అనేక పోరాటాలు చేసి సిపిఎం ప్రజలకు అందుబాటులో ఉందని అన్నారు. మండలంలో ప్రజలను సమీకరించి వారు ఎదుర్కొనే సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయడంలో కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. స్థానిక సంస్థలలో ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు అవకాశం కల్పించాలని ఓటర్లను కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడే సిపిఎం అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అభ్యర్థి కేతగోపాలం, ఆకుల హరేరామ్, ఎంపీటీసీ అభ్యర్థి కోడి లక్ష్మి తో పాటు సిపిఎం జిల్లా నాయకులు పివి ప్రతాప్, జక్కం శెట్టి సత్యనారాయణ, కేతా పద్మ, కోడి శ్రీనివాస ప్రసాద్, ఆకుల హరే రామ్, కుసంపూడి సుబ్బరాజు, ఎం ఆంజనేయులు, బత్తుల విజయ్ కుమార్, రాపాక ఆశీర్వాదం, పిల్లి రాజారావు పాల్గొన్నారు.

## ప్రచారంలో దూసుకుపోతున్న తెదేపా





**ప్రభాతవార్త చాట్రాయి** నామినేషన్ల పర్వం పూర్తి కావడంతో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఆయా గ్రామాలలో ప్రచారంలో దూసుకుపోతున్నారు. తెలుగుదేశం పార్టీ జడ్పిటిసి అభ్యర్థిగా తేళ్లూరి శేఖర్ పేరు ఖరారు కావడంతో మండలంలోని నరసింహారావు పాలెం గ్రామంలో విస్తృత ప్రచారం ప్రారంభించారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు సుపరిచితుడు అయిన శేఖర్ తనదైన శైలిలో ప్రచారం చేస్తున్నారు. నరసింహారావు పాలెం గ్రామానికి చెందిన సహకార సంఘ అధ్యక్షులు కట్టా నాగ దుర్గారావు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభిమానులు భారీగా పాల్గొని ప్రచారం చేస్తున్నారు. మంత్రి కొలుసు పార్థసారథి ప్రధాన అనుచరుడైన శేఖర్ ప్రచారంలో ముందంజలో ఉన్నారు. పోలవరం ఎంపీటీసీ అభ్యర్థిగా చల్లగుళ్ళ రాజ్యలక్ష్మి ప్రచారంలో ముందంజలో ఉన్నారు. నామినేషన్ వేసిన నాటినుండి ప్రచారంలో ముందుకు దూసుకుపోతున్నారు. తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షులు మరిడి చిట్టిబాబు, సహకార సంఘ అధ్యక్షులు యర్రా ప్రసాద్, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభిమానులతో గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను ఆకర్షిస్తూ ఓట్లు అడుగుతున్నారు. అదేవిధంగా మండలంలో చనుబండ గ్రామంలో ఎంపీటీసీ అభ్యర్థి అద్భుతరావు ఇంటింటి ప్రచారాన్ని మొదలుపెట్టారు. తెలుగుదేశం పార్టీ నూజివీడు నియోజకవర్గ రైతు సంఘ అధ్యక్షులు మోరంపూడి శ్రీనివాసరావు, నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నక్కా రాము, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చీదిరాల మారేశ్వరరావు తదితరులు ఆధ్వర్యంలో ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అదేవిధంగా మండలంలో పలు గ్రామాలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ప్రచారం కొనసాగిస్తున్నారు.

## ప్రచారం ప్రారంభించిన అభ్యర్థులు



**అత్తిలి, అక్టోబర్ 25 (ప్రభాతవార్త)** అత్తిలి మండలంలో కూటమి పార్టీల తరఫున జడ్పిటిసి అభ్యర్థిగా పోటీ చేస్తున్న సిరగాని నాగేశ్వరరావు ( నాగు ) గుమ్మంపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నవంబర్ 3న జరిగే ఎన్నికల్లో తనను గెలిపించాలని ఇంటింటా తిరుగుతూ ప్రచారం చేశారు. కేంద్రంలో బిజెపి రాష్ట్రంలో కూటమి పార్టీలు అధికారంలో ఉన్నందున స్థానికంగా కూడా కూటమి అభ్యర్థులు గెలుపొందడం అభివృద్ధి త్వరగా జరుగుతుందని తెలిపారు. ప్రచారంలో ద్వారకాతిరుమల దేవస్థానం ట్రస్టీ ఆల్తి సత్యనారాయణ, పట్టణ టిడిపి అధ్యక్షుడు కోరిపల్లి సత్యనారాయణ ప్రసాద్ , మెంతు రాజకుమార్, కలిగితి దయానందమూర్తి,వేంద్ర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఒంటెద్దు బళ్ళ సంఘం ఆధ్వర్యంలో మహా నివేదన అన్న సమారాధన



**భీమవరం అక్టోబర్ 25 ప్రభాతవార్త** అన్నిదానాలకెల్లా అన్నదానం ఎంతో గొప్పదని, దైవ కార్యక్రమాల్లో అన్న సమారాధనలు నిర్వహించడం భగవత్ సేవతో సమానమని పలువురు వక్తలు అన్నారు. భీమవరం నాచువారి సెంటర్ లోని కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం ఒంటెద్దు బళ్ళ సంఘం ఆధ్వర్యంలో మహా నివేదన,.అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు మహా నివేదనకు హారతులు ఇచ్చి పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వేలాది మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఒంటెద్దు బళ్ళ సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# వార్డుల్లో కూటమి అభ్యర్థి శైలజ విస్తృత పర్యటన



**నరసాపురం అక్టోబర్ 25 ప్రభాతవార్త** నరసాపురం పురపాలక సంఘం పరిధిలోని 14వ వార్డులో ఎన్డీయే కూటమి అభ్యర్థుల తరపున ప్రచారం హోరెత్తింది. కూటమి బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థినులు చైర్‌పర్సన్ అభ్యర్థిగా కొత్తపల్లి శైలజ జానకిరామ్, 14వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా తోట సూర్యకుమారి నానిల విజయానికై తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు, కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రతి ఇంటినీ సందర్శిస్తూ స్థానికులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, స్థానికంగా కూడా సమగ్ర అభివృద్ధి జరగాలంటే కూటమి అభ్యర్థుల విజయం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజాసేవే ధ్యేయంగా బరిలో నిలిచిన చైర్‌పర్సన్ అభ్యర్థిని కొత్తపల్లి శైలజ జానకీరామ్, కౌన్సిలర్ అభ్యర్థిని తోట సూర్యకుమారి నానిలకు గాజు గ్లాస్ గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో సంకు భాస్కర్ నాయుడు,భూపతి నరేష్, మల్లాడి మూర్తి,గుడాల సునీత నాని, ముస్కోడి రవి, మౌలాలి, రావి అప్పాజీ మరియుఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు, కొవ్వలి ఫాలోవర్స్, మహిళలు మరియు స్థానికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు



# శేషాచల కొండపై మృతదేహం కలకలం

### వారం రోజులుగా అక్కడే ఉన్నట్లు పోలీసుల అనుమానం.. మృతుడిని గుర్తించిన పోలీసులు



**ద్వారకాతిరుమల, అక్టోబర్ 25 (ప్రభాతవార్త):** ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రంలోని శేషాచల కొండపై మృతదేహం లభ్యం కావడం కలకలం రేపింది. మృతదేహం సుమారు వారం రోజులుగా అక్కడే ఉండి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై ద్వారకాతిరుమల ఎస్సై సుధీర్ తెలిపిన వివరాల ప్రకారం.. శేషాచల కొండపై మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రాథమిక విచారణలో మృతుడు ద్వారకాతిరుమల దేవస్థానంలోని చెప్పుల స్టాండ్‌లో పనిచేసిన వ్యక్తిగా గుర్తించినట్లు సమాచారం. మృతుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విధులకు దూరంగా ఉంటున్నట్లు, అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. ఆయన గత నాలుగేళ్లుగా ద్వారకాతిరుమలలో నివసిస్తున్నట్లు సమాచారం. పోలీసుల విచారణలో మృతుడు ఏలూరు జిల్లా గోకవరం మండలం ఎర్రంపల్లి గ్రామానికి చెందిన పంతం సత్యనారాయణ (సుమారు 70)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. పోస్టుమార్టం నివేదిక అనంతరం మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ఈ ఘటనపై పోలీసులు తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు.



# 30వ వార్డులో స్వతంత్ర అభ్యర్థి సుబ్బలక్ష్మి విస్తృత ప్రచారం..

## పెద్ద ఎత్తున పాల్గొన్న వార్డ్ ప్రజలు, ట్రాన్స్ జెండర్లు





**జంగారెడ్డిగూడెం అక్టోబర్ 25 ప్రభాత వార్త** గత పాలక వర్గం లో పెద్ద ఎత్తున నిధులు ఖర్చుచేసి వార్డు అభివృద్ధికి కృషి చేశా నని ఈ సారి ప్రజలకోరిక మేరకు మున్సిపల్ ఎన్ని కల్లో స్వతంత్ర అభ్యర్థి నిగా పోటీ లో వున్న తనను మంచి మెజారిటీ తో గెలిపించాలని 30వ వార్డ్ ఇండిపెండెంట్ గా పోటీ చేస్తున్న నేట్రూ సుబ్బలక్ష్మి కోరారు. ఆదివారం పెద్ద సంఖ్య లో మద్దతు దారులు వెంట రాగా సుబ్బలక్ష్మి ఆమె భర్త గణేష్ వార్డు పరిధిలో ని పలు కాలనీ ల లో ఎన్నికల ప్రచారం చేశారు. ఉంగరం గుర్తు తో తాను బరి లో ఉన్నా నని ఆ గుర్తు పై ఓటు ముద్ర వేసి అభివృద్ధి కీ బాటలు వెయ్యాలని సుబ్బలక్ష్మి గణేష్ పిలుపు నిచ్చారు. మిగతా ప్రాంతాలలో కంటే ఈ వార్డు కొంత మేర అభివృద్ధి జరిగిందని ఇంకా రోడ్లు ఇతర కార్యక్రమాలు మిగిలిఉన్నా యని మరో అవకాశం ఇస్తే అవి కూడా పూర్తి అవుతాయని వారు పేర్కొన్నారు. ప్రజల మద్దతు అండ దండాలే తమకు శ్రీ రామ రక్ష అని వారు అన్నారు. ఏ కాలనీ కీ వెళ్లినా ప్రజా దరణ ఎంతో బావుందని స్థానిక అభ్యర్థి గా ప్రజలు గుర్తించి ఆదరిస్తూ స్వాగతం పలకటం తన అదృష్టమని ఇదే అభిమానం తో ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారం లో స్థానిక ట్రాన్స్ జెండర్లు పాల్గొని సుబ్బలక్ష్మి విజయం కోసం తమ వంతు సహకారాన్ని అందిస్తున్నట్టు గణేష్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఆరోగ్య పరిరక్షణకు యోగా ఎంతో అవసరం

### యోగా గురువు కర్రి శ్రీనివాసరెడ్డి



**తణుకు, అక్టోబర్ 25(ప్రభాత వార్త):** శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణకు యోగా ఎంతో ఉపయోగకరమని యోగా గురువు కర్రి శ్రీనివాసరెడ్డి అన్నారు. తణుకులో నిర్వహించిన యోగా శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఆయన యోగా ప్రాముఖ్యత, దాని వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడంతో పాటు మానసిక ప్రశాంతతను పొందవచ్చని తెలిపారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. చిన్న వయస్సు నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ తమ శారీరక సామర్థ్యానికి అనుగుణంగా యోగాసనాలు, ప్రాణాయామం సాధన చేయాలని సూచించారు. యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని కర్రి శ్రీనివాసరెడ్డి వివరించారు. ప్రజల్లో యోగాపై మరింత అవగాహన పెంపొందించడమే ఇటువంటి శిక్షణ తరగతుల ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

# శాంతియుత వాతావరణంలో ఎన్నికలకు సహకరించండి



**చాట్రాయి అక్టోబర్ 25(ప్రభాత వార్త):** చాట్రాయి ఎస్సై రామకృష్ణ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని చాట్రాయి సబ్ ఇన్స్పెక్టర్ డి రామకృష్ణ చెప్పారు. ఆదివారం చాట్రాయి మండలం చిత్తపూరు గ్రామంలో ప్రత్యేక గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో రానున్న లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేసినట్లు అయన చెప్పారు.ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం నిబంధనలను విధిగా పాటించాలని, చేయకూడని పనులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల పేరుతో చిన్న చిన్న విషయాలకు, రాజకీయాల కోసం గ్రామాల్లో గొడవలు పడకుండా అందరూ కలిసిమెలిసి ఉండాలని హితవు పలికారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా, నిర్భయంగా తమకు లభించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.చిత్తపూరు గ్రామంలో ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో, సజావుగా జరిగేందుకు పోలీస్ శాఖ తరఫున పూర్తి స్థాయి సహాయ సహకారాలు మరియు పటిష్టమైన బందోబస్తు అందించబడు తుందని ప్రజలకు భరోసా కల్పిస్తామని చెప్పారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా ఎవరు వ్యవహరించినా, చట్టాన్ని చేతిలోకి తీసుకున్నా పోలీస్ శాఖ తరఫున అత్యంత కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామస్తులందరూ పోలీస్ అధికారులతో సహకరించి, ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం కూటమి అభ్యర్థులు

**అత్తిలి, అక్టోబర్ 25 ( ప్ర భా త వార్త)** అత్తిలి మండలంలో మండల పరిషత్తు ప్రాదేశిక నియోజకవ ర్గాలకు సంబంధించి 20 మంది కూటమి అభ్యర్థులను ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ తరఫున పాలూరు నుండి వెలగపల్లి ధనలక్ష్మి,, ఉ నికిలి నుండి సిర్రా రాంబాబు, ఈడూరు నుండి పిల్లి చంద్రబాబు, పాలి నుండి వేంద్ర కుమారి, కొమ్మర నుండి ఎలమంచిలి అప్పాజీ, గుమ్మంపాడు నుండి పంపన సుబ్బలక్ష్మి, లక్ష్మీనారాయణ పురం నుండి సూరిశెట్టి శిరీష, బల్లిపాడు నుండి రాచపోతు వెంకట సత్యవతి, ఉ ర దా ళ్లపాలెం నుండి బొర్రా వెంకట్రామయ్య, అత్తిలి 1 నుండి కోరిపల్లి హరి, 2 నుండి సీతాల వెంకటలక్ష్మి, ఐదు నుండి బొంతు నాగార్జున, ఆరవల్లి నుండి వెలగల సత్యనారాయణరెడ్డి పోటీ చేస్తారు. జనసేన పార్టీ తరపున స్కిన్నేరపురం నుండి వీరమ ళ్ల బాబూజీ, మంచిలి నుండి కేతా విజయ షణ్ముఖేశ్వరి, తిరుపతి పురం నుండి గవర శ్రీలక్ష్మి, అత్తిలి 3 నుండి అడ్డగర్ల మహాలక్ష్మి, 4 నుండి బడే టి త్రినాథ్ పోటీ చేస్తారు. బిజెపి పార్టీ తరపున వరిగేడు నుండి నామన లక్ష్మి పోటీ చేస్తారు.

## ఐదు నామినేషన్లు ఉపసంహరణ

**అత్తిలి, అక్టోబర్ 25(ప్రభాత వార్త )** అత్తిలి మండల పరిషత్తు ప్రాదేశిక నియోజక వర్గాలకు నామినేషన్లు వేసిన వారిలో ఐదుగురు నామినేషన్లు ఉపసంహరించుకున్నట్లు రిటర్నింగ్ అధికారి యు. మంగపతి రావు తెలిపారు. ఆరవల్లి నుండి 1, అత్తిలి 5 నుండి 1, గుమ్మంపాడు నుండి 1, లక్ష్మీనారాయణ పురం నుండి 2 నామినేషన్లు ఉపసంహరించుకున్నట్లు తెలిపారు.

## మానవతా సంస్థ ఆధ్వర్యంలో సాయం




**పెనుమంట్ర, అక్టోబర్ 25, (ప్రభాతవార్త)** మండలంలోని మార్టేరు మానవత సంస్థ వైద్య ఖర్చుల నిమిత్తం కడలి రామకృష్ణ (టైలర్), చిర్ల నాగమణికి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేసి తన మానవతను చాటింది. కీ శే. కోనాల సత్యనారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సంగీత్‌రెడ్డి వీల్‌చైర్‌ను సంస్థకు అందించారు. బోడపాటి సోమేశ్వరరావు పెనుమంట్ర మానవత శాఖకు రూ.10 వేల విరాళం అందించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జిల్లా అధ్యక్షులు మొక్కలు నాటారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో మండల అధ్యక్షులు పడాల రామచంద్రరెడ్డి అధ్యక్షతన నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు వాసుబోయిన చంద్రయ్య, డా. కోడూరి కృష్ణమూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రరెడ్డి ఆశయ సాధనకు సభ్యులంతా ఐక్యంగా పనిచేస్తూ సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు కొత్త సత్యనారాయణమూర్తి, కర్రి నరేంద్రరెడ్డి, మండల కార్యదర్శి నరేంద్ర, చైర్మన్ కడలి సుబ్రహ్మణ్యం, మండల కన్వీనర్ కర్రి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యోగాలో ఏ.పీ .ఆర్.ఎస్ విద్యార్థినుల ప్రభంజనం

### జాతీయ పోటీలకు ముసునూరు గురుకుల బాలికలు




**ముసునూరు, అక్టోబరు 24 ప్రభాతవార్త:** ముసునూరు గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 10, 11 తేదీల్లో నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో అండర్ - 17 విభాగంలో పదవ తరగతి విద్యార్థినీ హారిక ద్వితీయ స్థానం, అండర్ -14 విభాగంలో విద్యార్థినీ ఐశ్వర్య ఎనిమిదోవ స్థానం సాధించి జాతీయస్థాయి యోగా పోటీలకు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ కె.లక్ష్మీకుమారి. పి. ఈ.టీ నాగమల్లేశ్వరిలు తెలిపారు. జార్ఖండ్లో జరిగే జాతీయ యోగా పోటీల్లో ఇద్దరు బాలికలు పాల్గొంటారని చెప్పారు. విజేతలైన విద్యార్థినీలు మాట్లాడుతూ తమ పాఠశాలలో కార్పొరేట్ పాఠశాల స్థాయిలో చదువు, క్రీడలు తమ ఉపాధ్యాయులు తమ పట్ల ప్రత్యేక కృషి చేస్తున్నారని వివరించారు.2022 సంవత్సరం నుంచి యోగాలో ప్రత్యేక సాధన చేస్తున్నట్లు వారి పేర్కొన్నారు.

## మండలాన్ని వైసీపీ కైవసం చేసుకుంటుంది

### వైయస్సార్ పార్టీ సీనియర్ నేత దేశిరెడ్డి



**ప్రభాతవార్త చాట్రాయి** చాట్రాయి మండలాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి కైవసం చేసుకుంటుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార సంఘ మాజీ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి అన్నారు. చాట్రాయి మండలంలో 15 ఎంపీటీసీలు గాను 9 ఎంపీటీసీలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని మండల పరిషత్ పీఠాన్ని కైవసం చేసుకోవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. మండలంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని కార్యకర్తలు నాయకులు కష్టపడి పని చేస్తే విజయం సునాయసమని ఆయన చెప్పారు. గతంలో 15 ఎంపీటీసీలు గాను రెండు పర్యాయాలు క్లీన్ షిప్ చేశామని ఇప్పుడు 9 ఎంపీటీసీలు గెలవడం పెద్ద కష్టం కాదని చెప్పారు. ఇప్పటికే గ్రామాలలో ప్రచారం ముమ్మరంగా సాగుతుందని ఆయన వివరించారు. గ్రామాలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనూహ్య స్పందన లభిస్తోందని గత ప్రభుత్వ హయాంలో జగన్మోహన్ రెడ్డి అందించిన పథకాలను వివరిస్తూ ముందుకు దూసుకు వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. జెడ్పిటిసి విషయానికి వస్తే మండలాలు ఆవిర్భావం తర్వాత ఇప్పటివరకు తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకోలేదని అఖండ మెజారిటీతో విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

